సాక్షి
ఒడిశా
సోమవారం । 15 । జూలై । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 1,72,878

- భువనేశ్వర్/పూరి



జగన్నాథ స్మరణలో..!

జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు సందడిగా కొన సాగుతున్నాయి. దశావతారాలలో చివరిదైన కల్కి అవతారంలో జగన్నాథుడు భక్తులకు దర్శ నచ్చాడు.

- 8లో



జయపురంలో జ్వరాలు

జయపురంలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు జ్వరాల బారిన పడుతున్నారని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు.

- 8లో

సిరిసంపదల లెక్కకు శ్రీకారం

- తెరుచుకున్న జగన్నాథుని రత్న భాండాగారం
- వెలుపలి గదుల్లోని ఆభరణాలు స్ట్రాంగ్‌రూమ్‌కు తరలింపు
- నీలాద్రి విజే తర్వాత మలి విడత లెక్కింపు



రత్న భాండాగారం ద్వారపాలకుడు లోకనాథుని ఆజ్ఞామాలను తీసుకొస్తున్న దృశ్యం



జగన్నాథ ఆలయ సముదాయం

భువనేశ్వర్: దశాబ్దాల నిరీక్షణకు తెరపడింది. పూరీలోని జగన్నాథుని రత్న భాండాగారంలో సంపద లెక్కింపు ప్రక్రియ ఆదివారం మధ్యాహ్నం 1.28 గంటలకు ప్రారంభమైంది. రత్న భాండాగారం తనిఖీ పర్యవేక్షక కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బిశ్వనాథ్ రథ్ ఆధ్వర్యంలో 11 మంది ప్రముఖులు శుభఘడియల్లో రత్న భాండాగారం లోపలికి ప్రవేశించారు. వీరిలో పూరీ జిల్లా కలెక్టర్, భారత పురావస్తు శాఖ సూపరింటెండెంట్, రత్న భాండాగారం సబ్ కమిటీ సభ్యుడు, పర్యవేక్షక ప్యానెల్ నుంచి ఇద్దరు సభ్యులు, గజపతి మహారాజు ప్రతినిధి, సేవకుల సంఘం నుండి నలుగురు ప్రతినిధులు ఉన్నారు.

తొలి రోజు ఇలా..

సుమారు నాలుగున్నర దశాబ్దాలుగా తెరుచుకోని రత్న భాండాగారంలో అన్ని గదుల్ని ఏక విడతలో తెరిచి సమగ్ర సంపదని లెక్కించడం అసాధ్యం. తొలి రోజున వెలుపలి భాండాగారం తెరిచి దానిలోని సంపదని శ్రీ మందిరంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. వెలుపలి గది పని పూర్తి కావడంతో లోపలి గది తెరిచే సరికి వేళ దాటింది. ఒకసారి గదిలోని సంపదని తాకితే నిరవధికంగా సమగ్ర సంపదని తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాల్సి ఉంటుంది. ఇది సాధ్యం కానందున తొలి రోజున నామమాత్రపు పర్యవేక్షణతో పని ముగించారు. లోపలి గదిలో పలు చెక్క పెట్టెలు, బీరువాలు, సొరుగుల్లో రత్న సంపద ఉన్నట్లు గుర్తించారు. జగన్నాథుని మారు రథయాత్ర నీలాద్రి విజే తర్వాత రత్న భాండాగారం పర్యవేక్షణ మలి విడత తేదీ ప్రకటిస్తారు.

కట్టుదిట్టమైన నియమావళి

లెక్కింపు సందర్భంగా ఆలయ ప్రధాన పాలనాధికారి సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం పొందిన నిర్ధారిత కార్యాచరణ నియమావళి(ఎస్‌ఓపీ)ని పకడ్బందీగా అమలు చేశారు. రత్న భాండాగారం తెరిచి శ్రీమందిరం సింహద్వారం మినహా మిగిలిన 3 ద్వారాల్ని మూసి వేశారు. తనిఖీ కోసం లోనికి ప్రవేశించే సభ్యులను బెహెరాన్ ద్వారం సమీపంలో తనిఖీ చేసి అనుమతించారు. ఈ ప్రక్రియనంతా వీడియో తీశారు.

తాళాలు విరగ్గొట్టి..

గతంలో రత్న భాండాగారం తాళం చెవి గల్లంతైంది. తదుపరి దశలో నకిలీ తాళం చెవిలు లభ్యమైనట్లు అధికార వర్గాలు ప్రకటించాయి. దీర్ఘకాలంగా లోపలి భాండాగారం తెరవనందున నకిలీ తాళం చెవిలతో తలుపులు తెరవలేని పరిస్థితుల్లో విరగొట్టాల్సిందేనని తనిఖీ పర్యవేక్షణ ఉన్నత స్థాయి కమిటీ ఎస్‌ఓపీలో పేర్కొంది. ఈ క్రమంలో ఆదివారం రత్న భాండాగారం తెరిచే ప్రయత్నంలో కలెక్టర్ అందజేసిన తాళం చెవి పనిచేయకపోవడంతో ఫోరెన్సిక్ నిపుణులతో మేజిస్ట్రేట్, కలెక్టర్ సమక్షంలో తాళాలు విరగ్గొట్టారు. 3 తాళాల్లో ఒకటి మాత్రమే సీలు వేసి ఉండగా మిగిలిన రెండు తాళాలకు సీలు లేనట్లు గుర్తించారు. 2 కొత్త తాళాలతో లోపలి గది మూశారు. ఈ రెండు తాళాలు సీలు చేసి తాళం చెవులను జిల్లా కలెక్టరుకు అప్పగించి ట్రెజరీలో భద్రపరిచేలా ఆదేశించారు.



సంప్రదాయం ప్రకారం..

శ్రీ మందిరం రత్న భాండాగారం యజమాని శ్రీ మహాలక్ష్మి. సంరక్షకురాలు విమలా మాత, ప్రధాన రక్షకుడు లోకనాథ మహాప్రభువు. ప్రభువు నుంచి ఆజ్ఞామాల రావడంతో సభ్యులు శ్రీ మందిరంలోనికి అడుగిడారు. తొలుత మహా లక్ష్మి, విమలా మాతని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మి నుంచి అనుమతి పొందిన తర్వాత తలుపులు తెరిచారు.

భారీ చెక్క పెట్టెల తరలింపు..

రత్న భాండాగారంలో స్వామి ఆభరణాలు భద్రపరిచేందుకు పూరీకి 6 భారీ చెక్క పెట్టెలు తరలించారు. వీటిని టేకు కలపతో తయారు చేసి లోపల నలువైపులా ఇత్తడి తాపడంతో సిద్ధం చేశారు. ఒక్కో పెట్టె 4.5 అడుగుల పొడవు, రెండు అడుగుల వెడల్పు, రెండు అడుగుల లోతు పరిమాణంతో తయారయ్యాయి. స్వామి యాత్ర సందర్భంగా వినియోగించే పెట్టెల్ని ఇవి పోలి ఉన్నాయి. రత్న భాండాగారంలో సమగ్ర సంపద భద్రపరిచేందుకు మొత్తం 15 చెక్క పెట్టెలు అవసరం ఉంటుందని అంచనా. ఈ మేరకు తయారీ పనులు కొనసాగుతున్నాయి. తొలి దశ పనుల కోసం 6 పెట్టెల్ని సిద్ధం చేశారు.

పాముల భయం లేదు..

దశాబ్దాల తర్వాత రత్న భాండాగారం తెరుస్తున్నందున పాములు నిండి ఉంటాయని సోషల్ విస్తృత ప్రచారం జరగడంతో స్నేక్ హెల్ప్‌లైన్, ఓడ్రాఫ్ దళాల్ని సిద్ధం చేశారు. అయితే రత్న భాండాగారం లోపల పాముల భయం లేనందున స్నేక్ హెల్ప్ లైన్ నిపుణుడు సువేందు మల్లిక్ ఆధ్వర్యంలో బృందం వెనుదిరిగింది.


ఆకస్మిక అవసరాల దృష్ట్యా ఈ బృందాన్ని శ్రీ మందిరం ఆవరణలో అందుబాటులో ఉంచారు. లోపలికి మాత్రం అనుమతించ లేదు.

గబ్బిలాల అలికిడి..

రత్న భాండాగారం తెరవడంతో గబ్బిలాలు పెద్ద సంఖ్యలో అలికిడి చేశాయి. ఒక్కసారిగా బయటకు ఎగిరి వచ్చాయి. ఈ పక్షులు శ్రీ మందిరం సింహద్వారాన్ని అనుసంధాన పరిచే 22 పావంచాల మార్గంలో బయటకుఎగిరి పోయాయి.

ఎస్పీపై వదంతులు..

రత్న భాండాగారం తెరిచిన కాసేపటికి భద్రతా వ్యవస్థ పర్యవేక్షకుడు, పూరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ పినాకి మిశ్రా అస్వస్థతకు గురై సొమ్మసిల్లినట్లు పుకారు వ్యాపించింది. ఈ వార్తని సేవాయత్ ప్రతినిధి ఒకరు ప్రసారం చేయడంతో కాసేపు కలకలం రేగింది. తక్షణమే ఎస్పీ స్వయంగా మీడియా ముందు హాజరై వదంతులు నమ్మవద్దని, తాను పూర్తి ఆరోగ్యంతో ఉన్నట్లు స్పష్టం చేశారు.



శ్రీ మందిరంలో మహాలక్ష్మి

పూరీ సాగర తీరంలో సుదర్శన్ పట్నాయక్ రూపొందించిన రత్న భాండాగారం సైకత శిల్పం

జగన్నాథ స్మరణతో వెళ్లాం



రత్న భాండాగారం లోపల పరిస్థితి సాధారణంగానే ఉంది. మాలో ఎవరికీ ఎటువంటి శారీరక , మానసిక ఇబ్బంది కలగలేదు. అందరూ జగన్నాథుని నామస్మరణ చేస్తూ లోపలికి వెళ్లాం.కొన్ని చెక్క పెట్టెలు (2), కొన్ని బీరువాలు (5), ఇతర వస్తువులు ఉన్నాయి. వెలుపలి గది నుంచి సంపదను తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచేందుకు సుమారు 3 గంటలు నిర్విరామంగా శ్రమించాల్సి వచ్చింది.

– జస్టిస్ బిశ్వనాథ్ రథ్

న్యూస్‌రీల్

మలేరియాపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న కలెక్టర్ మహాజన్

రాయగడ: జిల్లాలో వ్యాప్తి చెందుతున్న మలేరియా, డెంగీ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ సూచించారు. సదరు సమితి పరిధిలోని సిరిగుడ వద్ద ఏకలవ్య మోడల్ ఆశ్రమ పాఠశాలలో ఆదివారం డెంగీ, మలేరియా వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో మలేరియా వ్యాధితో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ ఆస్పత్రి పాలవుతున్నారని, ముందస్తుగా మేల్కొంటే ముప్పు నుంచి తప్పించుకోవచ్చని చెప్పారు. ఎవరికైనా అనారోగ్యం తలెత్తితే అశ్రద్ధ చేయకుండా వెంటనే చికిత్స చేయించుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపైనా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖాధికారి భరత్‌భూషణ్ బిశ్వాల్, సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్రాదేవి, జిల్లా అదనపు సంక్షేమ శాఖ అధికారి ప్రశాంత్ కుమార్ బౌరి, జిల్లా మెడికల్ ఆఫీసర్ రాజేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ప్రాణదానం



రక్తదానం చేస్తున్న పూర్వ విద్యార్థులు

పర్లాకిమిడి: రక్తం దానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేసినట్లేనని బెత్తగుడలోని జవహర్ నవోదయ విద్యాలయం పూర్వ విద్యార్థులు(జాగో) సంఘ అధ్యక్షుడు నూకల వెంకటేష్ తెలిపారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు రక్తాన్ని అందించేందుకు ఈ శిబిరం నిర్వహించినట్లు వెంకటేష్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు జిల్లా పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ప్రమోద్‌చంద్ర పండా, సీనియర్ ఫార్మసిస్టు బెహరా, జాగో ఉపాధ్యక్షుడు మనోజ్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ.. జగమంత సంపద

- వీడనున్న రత్న భాండాగారం రహస్యం
- పూరీ క్షేత్రంలో లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కావడంతో సర్వత్రా ఉత్కంఠ
- పాత లెక్కల ప్రకారం 454 బంగారు వస్తువులు, 293 వెండి వస్తువులు

భువనేశ్వర్: అసంపూర్ణ దారు విగ్రహ స్వరూపుడైన జగన్నాథుడు శ్రీమంతుడు. పూరీ శ్రీమందిరంలోని రత్నభాండాగారంలో విలువైన వజ్ర, వైడూర్య, స్వర్ణాభరణాలు కలిగి ఉన్నాడు. ఇంతటి అమూల్యమైన సంపద దశాబ్దాలుగా పదిలంగా ఉంటోంది. అయితే ఈ నిధి వివరాలపై కొన్నాళ్లుగా సందిగ్ధత నెలకొంది. 1978 తర్వాత రత్న భాండాగారం సంపద వివరాలు వెల్లడించకపోవడం, డూప్లికేట్ తాళాల గల్లంతు తదితర వివాదాలు చుట్టుముట్టాయి. గతంలో కొన్నిసార్లు రత్న భాండాగారం తెరిచేందుకు ప్రయత్నాలు జరిగినా సఫలీకృతం కాలేదు. ఈ నేపథ్యంలో కొత్తగా కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం తన ఎన్నికల హామీ మేరకు రత్నభాండాగారం లెక్కింపు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

రెండు గదుల్లో సంపద..

శ్రీమందిరంలో 11.78 మీటర్ల ఎత్తు, 6.74 మీటర్ల వెడల్పుతో 8.79 మీటర్లు సువిశాల విస్తీర్ణంలో వెలుపల, లోపల రెండు వేర్వేరు గదుల్లో మూల విరాటుల అమూల్య రత్న సంపద పదిలపరిచారు. ఆలయ నిర్మాణం తర్వాత రత్న భాండాగారం ఏర్పాటైనట్లు సూచిస్తున్న చారిత్రక వివరాల్లో మాత్రం దీని ఏర్పాటు తేదీ, ఇతర సమాచారం అందుబాటులో లేదు.

రాజుల విరాళాలు..

కేశరి, గంగ, సూర్య, భోయి వంశాల రాజులు, నేపాల్ పాలకులు తమ హయాంలో జగన్నాథునికి బంగారం, వెండి, వజ్రాలు, ఇతర విలువైన రత్నాలు, శాలగ్రామాలు వంటి విలువైన సంపదలను విరాళంగా అందజేశారు.

మాదలపంజిలో సమగ్ర వివరాలు..

శ్రీమందిరం మాదల పంజి (పంచాంగం)లో రత్న భాండాగారం సమగ్ర సమాచారం ఉంది. గజపతి రాజు కపిలేంద్రదేవ్ దక్షిణాది రాష్ట్రాలను జయించిన తర్వాత 16 ఏనుగులతో తరలించుకుని తెచ్చిన భారీ సంపద, ఆభరణాలను ఆలయానికి విరాళంగా ఇచ్చినట్లు శ్రీ మందిరం జయ–విజయ ద్వారం వద్ద ఉన్న ఒక శాసనం సూచిస్తుంది. కపిలేంద్ర దేవ్ పాలనలో త్రిమూర్తుల స్వర్ణ అలంకరణ ప్రారంభమైందని పురాణాలు చెబుతున్నాయి. స్వామి అమూల్య సంపదను దోచుకునేందుకు కాలా పహాడ్‌తో సహా పలువురు హిందూయేతర ఆక్రమణదారులు 18 సార్లు శ్రీమందిరంపై దాడులు చేసినట్లు చారిత్రాత్మక కథనాలు ప్రచారంలో ఉన్నాయి.



స్వర్ణాభరణ శోభతో జగన్నాథుడు

మూడు వర్గాలుగా ఆభరణాల భద్రత..

జగన్నాథ ఆలయ చట్టం 1954 ప్రకారం రత్న భాండాగారంలో ఆభరణాలను భద్రపరుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన జగన్నాథ ఆలయ నిబంధనలు–1960 ప్రకారం రత్న భాండాగారం నిర్వహణ బాధ్యత జగన్నాథ పాలక మండలికి కేటాయించారు. రత్న భాండాగారంలో 3 వర్గాల కింద సొత్తు పదిలపరుస్తారు. తొలి వర్గం కింద లోపలి భాండాగారంలో నగలు, ఆభరణాలు తదితర వాటిని భద్రపరుస్తారు. ఇందులో అరుదుగా వినియోగించే అమూల్యమైన ఆభరణాలు, నగలు మాత్రమే ఉంటాయి. తదుపరి రెండు వర్గాల నగలు, ఆభరణాలు, వస్తువులు వెలుపలి ఖజానాలో ఉంటాయి. వీటిని కేవలం యాత్రలు, ఉత్సవాలు, పండగల సమయాల్లో మాత్రమే ఉపయోగించే నగలు, ఆభరణాలుగా పరిగణిస్తారు. మూడో వర్గం కింద మూల విరాటుల రోజువారీ ఆభరణాలుగా పరిగణిస్తారు.

డబుల్ లాక్..

రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఒకటో వర్గం ఆభరణాలను రెండు తాళాలు(డబుల్ లాక్) వేసి భద్రపరుస్తారు. వీటి తాళం చెవిలు ప్రభుత్వ ఖజానాలో జమ చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ఆదేశాల మేరకు మాత్రమే ఈ తాళాలు తెరవాల్సి ఉంది. రెండో వర్గం కూడా రెండు తాళాల భద్రతలో నిర్వహిస్తారు. ఒక తాళం చెవి ఆలయ పాలక మండలి, రెండో తాళం చెవి పట్టజోషి మహాపాత్రొ వద్ద ఉండాలి. మూడవ వర్గం రత్న భాండాగారం తాళం . ఈ తాళం చెవి ఎల్లప్పుడూ పాలక మండలి జవాబుదారీగా భండార్ మేకప్ (దేవతల ఆభరణాల సంరక్షకుడు) వద్ద ఉంటుంది.

ఎన్నికల హామీ మేరకు..

ఎన్నికల ప్రచారం హామీ మేరకు బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో శ్రీ మందిరం రత్న భాండాగారం తెరిచే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ చర్యతో రత్న భాండాగారం తాళం చెవిల గల్లంతుకు సంబంధించి 2018 నివేదిక స్పష్టత రానుంది. 2024 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అరిజిత్ పసాయత్ నేతృత్వంలో న్యాయ విచారణ కమిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జూలైలో జరిగే రథయాత్రలో ఈ పని చేయాలని కమిటీ నిర్ణయించింది. ఇంతలో రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటైన బీజేపీ ప్రభుత్వం ఈ కమిటీని రద్దు చేసి జస్టిస్ బిశ్వనాథ్ రథ్ అధ్యక్షతన 16 మంది సభ్యులతో కూడిన రత్న భాండాగారం తనిఖీ కోసం కొత్త కమిటి ఏర్పాటు చేసింది.

తాళం చెవి గల్లంతు..

ఒడిశా హైకోర్టు చొరవతో 2018 మార్చిలో శ్రీ మందిరం రత్న భాండాగారం పరిశీలన చేపట్టారు.భారత పురావస్తు శాఖ (ఏఎస్‌ఐ) రత్న భాండాగారం నిర్మాణాత్మక పటిష్టతని మాత్రమే పరిశీలించింది. లోపలి ఖజానా పరిశీలనకు సాధ్యం కాలేదని నిస్సహాయత ప్రకటించింది. తాళాలు కనిపించకుండా పోయాయని పూరీ జిల్లా మేజిస్ట్రేట్ అరవింద అగర్వాల్ అప్పట్లో ప్రకటించడంతో ఈ సందిగ్ధత నెలకొంది. రెండు నెలల తర్వాత జిల్లా రికార్డు గదిలో రత్న భాండాగారం నకిలీ తాళం చెవి లభ్యమైందని కలెక్టర్ ప్రకటించినా లెక్కింపు మాత్రం జరగలేదు. లోపలి ఖజానా నకిలీ తాళం చెవిలు 1985 నాటి ఆలయ నిర్వాహకుడి ముద్రతో సీలు చేసిన కవరులో ఉన్నట్లు పేర్కొన్నారు. అయితే 1960 నియమాల ప్రకారం నకిలీ తాళం చెవికి సంబంధించి ఎటువంటి వివరాలు లేవు. ఈ పరిస్థితుల్లో డూప్లికెట్ కీ ఎలా.. ఎందుకు తయారు చేశారో ఇప్పటికీ సమాధానం లేని ప్రశ్నగా ఊగిసలాడుతోంది.



మూల విరాటుల భారీ బంగారు కిరీటాలు

1805 నుంచి 1978 దాకా..

- బ్రిటీష్ పాలనలో శ్రీ మందిరం రత్న భాండాగారం వివరాలను తొలిసారిగా ప్రకటించారు. అప్పటి పూరీ కలెక్టర్ చార్లెస్ గ్రోమ్ తయారు చేసిన జాబితా 1805 జూన్ 10న ప్రచురితమైంది. ఈ నివేదిక ప్రకారం 64 బంగారం, వెండి, రత్నాలు పొదిగిన నగలు ఉన్నట్లు పేర్కొంది. ఇవి కాకుండా, 128 బంగారు నాణేలు, 24 వివిధ రకాల బంగారు ముద్రలు, 1,297 వెండి నాణేలు, 106 రాగి నాణేలు, 1,333 రకాల బట్టలు ఉన్నాయి. తర్వాత 1926లో పూరీ రాజు అంగీకరించిన ఆభరణాల జాబితాను పూరీ కలెక్టరేట్‌లోని రికార్డు గదిలో భద్రపరిచారు.
- 1952లో శ్రీమందిర్ రికార్డ్ ఆఫ్ రైట్స్ తయారైంది. దీని ప్రకారం వెలుపలి ఖజానాలో 150 బంగారు ఆభరణాలు, లోపలి ఖజానాలో 180 ఆభరణాలు, 146 వెండి వస్తువులు ఉన్నట్లు నమోదు చేశారు.
- జగన్నాథ సంస్కృతి పరిశోధకుడు, శ్రీ జగన్నాథ పరిశోధన సంస్థ అధ్యక్షుడు సురేంద్ర నాథ్ దాస్ ప్రకారం వెలుపల భాండాగారంలో 150 బంగారు నగల్లో ఒక్కో ఆభరణం 100 తులాల (ఒక్కో తులం 11.6638 గ్రాములు) కంటే ఎక్కువ బరువైనవిగా పేర్కొన్నారు.
- తదుపరి పరిశీలన మార్చి 1962 నుంచి ఆగస్టు 1964 వరకు కొనసాగింది. అప్పటి శ్రీ మందిరం పాలన అధికారి ఎల్.ఎన్.మిశ్రా ఆధ్వర్యంలో రత్న భాండాగారంలో 602 ఆభరణాల వివరాలను మాత్రమే ధృవీకరించారు. శ్రీ మందిరం పాలక మండలి 1967 మే నెలలో మరో దఫా తనిఖీలు చేపట్టారు. ఇందులో 433 వస్తువులు మాత్రమే తనిఖీ చేశారు. దీంతో ఖజానా ధ్రువీకరణ అసంపూర్ణంగా మిగిలిపోయింది.
- ఒడిశా గవర్నర్ బి.డి.శర్మ ఆదేశాల మేరకు 1978 మే 13 నుంచి జూలై 23 వరకు రత్న భాండాగారం పరిశీలన చేపట్టారు. భాండాగారంలో రెండు వేర్వేరు ఖజానాల్లో 454 బంగారు వస్తువులు, 293 వెండి వస్తువులను లెక్కించారు.

గత జాబితా ప్రకారం సంపద..

1978లో ప్రకటించిన జాబితా ప్రకారం శ్రీ మందిరం రత్న భాండాగారం రెండు గదుల్లో మొత్తం 12,838 భొరి నికర బరువు (1 భొరి అంటే 10 గ్రాములకు సమానం) కలిగిన 454 బంగారు వస్తువులు, 22,153 భొరీల బరువున్న 293 వెండి వస్తువులు ఉన్నట్లు వెల్లడైంది. వర్గాల వారీగా లోపలి ఖజానాలో 4,364 భొరీల బరువున్న 367 బంగారు వస్తువులు, 14,878 భొరీల బరువున్న 231 వెండి వస్తువులు ఉన్నాయి. వెలుపలి ఖజానాలో రెండో వర్గం కింద 8,175 భొరీల బరువైన 79 బంగారు వస్తువులు, 4,671 భొరీల బరువైన 39 వెండి వస్తువులు ఉన్నాయి. 3వ వర్గం కింద 299 భొరీల బరువైన 8 బంగారు వస్తువులు, 2,693 భొరీల బరువైన 23 వెండి వస్తువులు ఉన్నాయి.

1978 తర్వాత కూడా తెరిచినా..

1978 చివరి జాబితా అయినప్పటికీ పాలక మండలి ఆధ్వర్యంలో లోపలి ఖజానా తెరవడం మాత్రం చివరిసారి కాదు. 1982, 1985లో రెండు సార్లు ఈ ఖజానా తెరిచారు. ఆలయ రికార్డుల ప్రకారం 1982 డిసెంబర్ 26న లోపలి ఖజానా తెరిచి గర్భ గుడి ప్రధాన ద్వారం కొలాహట్ ద్వారం తాపడం కోసం 3,337 భొరిల 10 అణాల వెండిని లోపలి ఖజానా నుంచి తీశారు. రెండో సారి 1985 జూన్ 14న బలభద్ర స్వామి బంగారు నుదుటి ఆభరణం చిత్తా (బాసికం) మరమ్మతు చేయడానికి లోపలి ఖజానా నుంచి 1,113 భొరిల 7 అణాల బంగారం తీసేందుకు తెరిచారు. ఈ రెండు సందర్భాల్లో రత్న భాండాగారంలోని సొత్తు పరిశీలన, లెక్కింపు, జాబితా రూపకల్పన వంటి చర్యలు చేపట్టలేదు.

క్లుప్తంగా

జయపురంలో జ్వరాల విజృంభణ



కేంద్రాస్పత్రిలో జ్వర పీడితులు

జయపురం: జయపురంలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులు జ్వరాల బారిన పడుతున్నారు. జిల్లా కేంద్రాస్పత్రికి ప్రతి రోజూ దాదాపు 15 మంది పిల్లల వైరల్ ఫీవర్ సమస్యతో ఆస్పత్రిలో చేరుతున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. వీరితో పాటు వందలాది మంది ప్రైవేటు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చాలినంత బెడ్లు లేకపోవడంతో కొందరు వరండాలను ఆశ్రయిస్తున్నారు. అధికారులు స్పందించి వ్యాధుల నియంత్రణకు తగు చర్య తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఔషధ వృక్షాలతో మేలు



మొక్కలు నాటుతున్న సభ్యులు

రాయగడ: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఔషధ వృక్షాలు నాటడం వల్ల అనేక ప్రయోజనాలు చేకూరుతాయని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ అధ్యక్షుడు రాజేష్‌కుమార్ దళాయి అన్నారు. సదరు సమితి పరిధిలోని వ్యూపాయింట్ వద్ద ఆదివారం భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, యువభారత్ రాయగడ శాఖల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పతాంజలి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు



విద్యుత్ స్తంభంపై చెలరేగిన మంటలు

రాయగడ: స్థానిక మెయిన్ మార్కెట్‌లోని జ్యుయెలరీ దుకాణం ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభంపై ఆదివారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సకాలంలో విద్యుత్ శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఉదయం వర్షం కురుస్తున్న సమయంలో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. ఆ చుట్టుపక్కల రథయాత్ర సందర్భంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన దుకాణాలు ఉన్నాయి. విద్యుత్ స్తంభం నుంచి మంటలు చెలరేగడంతొ దుకాణదారులు భయంతో పరుగులు తీశారు.

పాముకాటుతో ఇద్దరికి అస్వస్థత



చికిత్స పొందుతున్న రొసా మినియాక



గ్రామస్తులు పట్టుకున్న పాము

రాయగడ: పాముకాటు వేయడంతో ఇద్దరు అస్వస్థతకు గురయ్యారు. శనివారం రాత్రి సదరు సమితి బొడొకుటులి పంచాయతీ బొడొమానధర్ గ్రామానికి చెందిన రొసా మినియాక ఇంటిని శుభ్రం చేస్తుండగా పాము కాటు వేసింది. పామునే పట్టుకునే క్రమంలో ఆమె సోదరుడు నాగేశ్వర్ మినియాకకు కూడా పాము కాటు వేసింది. ఇద్దరినీ గ్రామస్తులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చి చికిత్స అందించారు. ప్రస్తుతం ఇద్దరి పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కాగా, పాముని గ్రామస్తులు పట్టుకుని సమీపంలో అడవులో విడిచిపెట్టారు.

జగన్నాథ స్మరణలో..!



పర్లాకిమిడి: కల్కి అవతారంలో జగన్నాథుడు



జయపురం: కల్కి అవతారంలో దేవతామూర్తులు



పర్లాకిమిడి: కిక్కిరిసిన భక్తులతో గుండిచా మందిరం



పర్లాకిమిడి: బోయకొండ వద్ద సందడి

పర్లాకిమిడి: జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు పర్లాకిమిడిలో సందడిగా కొనసాగుతున్నాయి. దశావతారాలలో చివరిదైన కల్కి అవతారంలో జగన్నాథుడు, బలభద్రులు ఆదివారం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గుసాని, కాశీనగర్, గుమ్మా సమితిల నుంచే కాకుండా మెళియాపుట్టి, చాపర, పలాస, పాతపట్నం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి అధిక భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం బహుడా రథయాత్ర జరగనున్నందున వేలాదిమంది విచ్చేశారు.

పర్లాకిమిడి: స్థానిక రాజవీధిలోని జగన్నాథ మందిరం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా జరుగుతున్నాయి. సంబల్‌పురి నృత్యంతో పలువురు కళాకారులు ఆకట్టుకున్నారు. ఒడిషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు ఈనెల 15తో ముగుస్తాయని జిల్లా సాంస్కృతిక శాఖ అధికారి అర్చనా మంగరాజ్ తెలిపారు.

జయపురం: రథయాత్ర ఉత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. జయపురంలో ఆదివారం కల్కి అవతారంలో జగన్నాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం మారు రథయాత్ర సందర్భంగా శ్రీజగన్నాథ, బలభద్ర, సుభద్ర దేవతామూర్తులు చైతన్య మందిరం వద్ద పిన్ని ఇంటి వద్ద రాత్రి విడిది చేస్తారు. భక్తులకు దర్శనమిచ్చాక మంగళవారం తిరిగి బయలుదేరుతారు.



రాయగడ: గుణుపూర్‌లో జగన్నాథుడు



పర్లాకిమిడి: సంబల్‌పురి నృత్యం చేస్తున్న ఒడియా కళాకారులు



రాయగడ: బుద్ధావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడు

ఎంపీ, ఎమ్మెల్యేలకు సన్మానం



ఎంపీ, ఎమ్మెల్యేలకు స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

జయపురం: ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన నవరంగపూర్ ఎంపీ బలభద్ర మఝి, కొట్‌పాడ్ ఎమ్మెల్యే రూపభొత్రలను ఆదివారం బొయిపరిగుడలో బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆర్‌అండ్‌బీ విశ్రాంత భవనంలో జరిగిన సన్మాన సభలో కొరాపుట్ బీజేపీ ఎమ్మెల్యే రఘునాథ్ మచ్చ కూడా హాజరయ్యారు. ముందుగా ఆదివాసీ సంప్రదాయ నృత్యాలతో ప్రజాప్రతినిధులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బొయిపరిగుడ సమితిని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని చెప్పారు. మావోయిస్టులకు అడ్డాగా మారిందన్నారు. కొత్తగా వచ్చిన బీజేపీ ప్రభుత్వ సారథ్యంలో బొయిపరిగుడను అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

ఫుట్‌బాల్ రిఫరీ పరీక్షలకు 80 మంది హాజరు

జయపురం: ఒడిశా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జయపురం స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఆదివారం ఫుట్‌బాల్ రిఫరీ ఎంపిక పరీక్షలు నిర్వహించారు. దక్షిణ ఒడిశా జోన్‌లో 8 జిల్లాల నుంచి 80 మంది యువత హాజరయ్యారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన వారిని తర్వాత దశ ఎంపికలకు పంపిస్తామని నిర్వాహకులు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రధాన రిఫరీ దుర్గామాధవ నాయిక్, కొరాపుట్ జిల్లా క్రీడా అసోసియేషన్ కార్యదర్శి అనూప్ కుమార్ పాత్రో, సబ్ డివిజన్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి రబి నాయిక్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: స్థానిక వలేసాగరం గ్రామానికి చెందిన మాలతి అనే వివాహిత ఆదివారం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మాలతి తన ఇంటిలో జరిగిన తగాదా కారణంగా మనస్తాపానికి గురై ఆదివారం ఇంటిలో ఉన్న పురుగు మందు తాగేశారు. ఇది గుర్తించిన స్థానికులు హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారు.

సేవలకు సత్కారం



సత్కారం అందుకుంటున్న తనూజా శతపతి

పర్లాకిమిడి: గజపతి జిల్లా ప్రగతి మహిళా సంఘటన్ కార్యదర్శి తనూజా శతపతిని కోణార్క్‌లో ఆదివారం జరిగిన బెలాభూమి సాహిత్య సంసద్ సాహితీ సమ్మేళనం ఘనంగా సత్కరించారు. నృత్యం, సాహిత్యం, గీతాలాపనలో ఆమె చేస్తున్న కృషిని గుర్తిస్తూ సన్మానించారు. తనూజాకు సత్కారం పట్ల యూటెక్ కంప్యూటర్స్ అధినేత లోకనాథ్ మిశ్రా, ఒడిశా సాహిత్య అకాడమీ సభ్యులు బిచిత్రానంద బెబర్తా, భాగవత్ పాఢి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కాటేసే కాలం



నాగు పాము

- పొలాల్లో పాముల సంచారంపై అప్రమత్తత అవసరం
- అప్రమత్తంగా లేకుంటే అంతే
- మంత్రగాళ్లతో ప్రాణానికే ముప్పు
- ఆధునిక వైద్యమే శ్రేయస్కరం

ఎల్ఎన్ పేట, హిరమండలం:

పొలం పనులు మొదలైపోవడంతో రైతులంతా రోజంతా పొలాల్లోనే గడుపుతున్నారు. ఈ సీజన్‌లోనే అత్యధిక మంది పాముకాట్లకు గురవుతుంటారు. ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. సాధారణంగా వర్షాకాలం వచ్చిందంటే పాముల సంచారం ఎక్కువగా ఉంటుంది. అప్పటి వరకు బొరియల్లో ఉన్న పాములు వర్షం నీరు చేరటంతో బయటకు ఆహారం సేకరించుకునేందుకు ఎలుకలు కోసం సంచారం చేస్తుంటాయి. అలాంటి సమయంలో పొలం గట్లపై తిరిగే రైతులకు ప్రమాదం పొంచి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే రైతుల ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుంది.

జాగ్రత్తలు తప్పనిసరి..

- పొలం పనులకు వెళ్లే రైతులు గట్లపై నడిచే సమయంలో పాద రక్షలు ధరించాలి.
- వీలైనంత వరకు కాళ్ల చెప్పులను కప్పేలా ప్యాంట్లు ధరించడం మంచిది.
- కర్రతో చప్పుడు చేస్తూ నడవటం వల్ల అలికిడికి పాములు దూరంగా వెళ్లిపోతాయి.
- రాత్రిళ్లు సాగునీటి కోసం మోటార్లు వేసేందుకు పొలానికి వెళ్లే రైతులు తమతో పాటు టార్చిలైటు తీసుకుని వెళ్లాలి.
- మోటారు స్టార్టర్ వద్ద పాములు ఉండే అవకాశం ఉంది. గమనించాలి. ధాన్యం గాదెలు, గడ్డి కుప్పలు, కర్రలు, పిడకలు నిల్వ చేసే ప్రాంతాలతో పాటు తేమగా ఉన్న చోట్లకు కప్పలు, ఎలుకలు చేరుతాయి. వాటిని తినేందుకు పాములు అక్కడికే వస్తుంటాయి.
- ఇళ్ల చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఎలాంటి పిచ్చిమొక్కలు, చెత్తా లేకుండా చూసుకోవాలి.
- కిటికీలకు, తలుపులకు మెస్‌లు ఏర్పాటు చేసుకోవాలి. ఎప్పుడూ తలుపులు, కిటికీలు వేసి ఉంచడం ఉత్తమం.



కొండచిలువ



రక్తపింజర

పాము కాటు వేస్తే..

- విష సర్పాలు కాటు వేసిన శరీర భాగంలో కోరల గాయం స్పష్టంగా కనిపించి నొప్పి తీవ్రంగా ఉంటుంది.
- నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది.
- పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్లు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లుగా ఉంటుంది.
- గొంతులో ఏదీ దిగని పరిస్థితి ఏర్పడుతుంది. నోటి ద్వారా చొంగ కారడంతో పాటు కళ్లు మగతగా మారి శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు.
- రెండు గాట్లు పడితే విషపూరితమైన పాము కాటేసినట్లుగా గుర్తించాలి. తాచు కంటే కట్ల పాము ప్రమాదకరం.
- రక్తపింజర కాటేస్తే విషం రక్తంలో చేరిపోతుంది. నోరు, ముక్కు ద్వారా రక్తం బయటకు వస్తుంది. వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలి.

విషం కన్నా భయమే ప్రమాదం

పాము కాటేసిన తర్వాత విషం కంటే భయమే ప్రాణానికి ప్రమాదంగా మారుతుంది. పాము కాటుకు గురైన వ్యక్తి అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉన్నందున తనకేమీ కాదన్న ధైర్యంతో ఉంటే ఎంతో మేలు జరుగుతుంది. పాము కాటుకు గురైన వ్యక్తికి ఎంత త్వరగా ఆధునిక వైద్యం అందిస్తే అంత మంచిది. పసరు మందులు, నాటు వైద్యం, మంత్ర తంత్రాలు అంటూ ఆలస్యం చేయడం వల్ల ప్రాణానికి ప్రమాదం ఏర్పడుతుంది. పాము కాటుకు గురైన వ్యక్తికి నడిపించకూడదు. 108 అంబులెన్స్‌ల్లో తీసుకువెళ్లడం మంచిది. పాము కాటు వేసిన శరీర భాగంలో పైన రక్తప్రసరణ జరగకుండా కట్టు కట్టాలి. అవసరం అనుకుంటే మూడు, నాలుగు రోజులు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచడం ఎంతైనా మంచిది.

విష పూరిత పాములు

- నాగుపాము కాటేసిన 10 నుంచి 20 నిమిషాల్లో నోటి నుంచి నురగ రావటం, శరీరం మొద్దుబారిపోవటం, ఊపిరి తీసుకోవటం కష్టంగా మారుతుంది.
- రక్తపింజరి కాటేసిన రెండు గంటల్లో విషం శరీరంలో కలుస్తుంది.
- కట్లపాము కాటేసిన క్షణాల్లోనే విషం రక్తంలో కలుస్తుంది. పాము కాటేసిన వెంటనే వైద్యం అందివ్వటం వల్ల మనిషి ప్రాణాలను కాపాడుకోవచ్చు.

వెంటనే వైద్యం అందించాలి..



పాము కాటుకు గురైన వ్యక్తిని సమీపంలోని ఆస్పత్రిలో చేర్చాలి. ప్రథమ చికిత్స చేసిన తర్వాత విషానికి విరుగుడు మందును ఇస్తారు. ఆస్పత్రికి తీసుకువెళ్లడం ఎంత ఆలస్యం చేస్తే ప్రాణానికి అంత ప్రమాదం. ఆలస్యం అవుతున్న కొద్దీ విషం రక్తంలో కలిసి శరీరంలో కొన్ని భాగాలు పని చేయకుండా చేస్తుంది. అలాంటప్పుడు వ్యక్తి ప్రాణాలు కాపాడటం కష్టం అవుతుంది. పాము కాటుకు గురైన వ్యక్తికి తగిన ధైర్యం చెప్పాలి. పసర మందులు, మంత్రగాళ్లను నమ్మవద్దు.

– డాక్టర్ నీతూ, ప్రభుత్వ ఆస్పత్రి, తురకపేట, ఎల్ఎన్ పేట

ముగిసిన అవధాన ప్రక్రియ



అవధాని అపర్ణను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్:

అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం, సుమిత్రా కళాసమితి సంయుక్త నిర్వహణలో నిర్వహించిన అవధాన ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. అరసవల్లిలోని వైజయంతి ఉత్సవ మండపంలో పులఖండం వేంకటరమణమూర్తి వేదికలో ద్విశతావధాన కళా విలాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం ముగింపు కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరయ్యారు. ద్విశతావధాని బులుసు అపర్ణను కళాసమితి తరఫున ఘనంగా సత్కరించారు. ముందుగా నాలుగురోజుల పాటు జరిగిన సాహితీ ప్రక్రియలో ప్రాశ్నికులు సంధించిన సమస్యలు, దత్తపదులు, వర్ణనలు, ఆశువులకు మళ్లీ అవధాని అపర్ణ 200 పద్యాలను ధారణ చేశారు. కార్యక్రమంలో విశాఖకు చెందిన డాక్టర్ పేరి రవికుమార్ మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, బీజేపీ నాయకులు పూడి తిరుపతిరావు, ఉమామహేశ్వరరావు, పండితులు దోర్బల ప్రభాకర శర్మ, విజయవాడకు చెందిన పంతులు తపస్వి, దండిభోట్ల దత్తాత్రేయ శర్మ, సమితి గౌరవాధ్యక్షులు కొంచాడ సోమేశ్వరరావు, అధ్యక్షులు ఇప్పిలి శంకరశర్మ, డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, బంకుపల్లి రమేశ శర్మ, మండవిల్లి రవి, చిన్నారావు, నక్క శంకరరావు, రంపా సాయికుమార్, బంకుపల్లి శంకరం, కొంక్యాణ మురళీధర్, పూజ, పార్థసారథి, వరలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మడ్డువలస నీరు విడుదల



సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఆదివారం సాగునీరు విడుదల చేశారు. ఇరిగేషన్ అధికారులతో కలిసి ప్రాజెక్టు వద్ద ప్రత్యేక పూజల అనంతరం కుడి ప్రధాన కాలువ హెడ్ స్లూయిస్ వద్ద బటన్ నొక్కి సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయకట్టులోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే తమ ప్రభుత్వం లక్ష్యమని వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బొత్స వాసుదేవరావునాయుడు, పిన్నింటి మోహనరావు, ఈఈ మన్మథరావు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ



దొంగతనం జరిగిన ఇళ్ల వద్ద వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

పార్వతీపురం టౌన్: మండలంలోని నర్సిపురం గ్రామంలో రెండిళ్లలో శనివారం రాత్రి దొంగతనం జరిగింది. దీనిపై రూరల్ ఎస్సై దినకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎస్ జగన్నాథం, ఎస్. వెంకటరమణలు శుభకార్యం నిమిత్తం శనివారం కుటుంబసమేతంగా పెదమేరంగి వెళ్లారు. ఆదివారం వారు తిరిగి వచ్చేసరికి వారి ఇళ్ల తలుపులు బద్దలుగొట్టి ఉన్నాయి. జగన్నాథం ఇంటిలో 20 1/2 తులాల బంగారం, 50 తులాల వెండి, రూ. 40 వేలు నగదు, వెంకటరమణ ఇంటిలో 14తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.30వేల నగదు పోయినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై వివరాలు సేకరించి కేసునమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

దివ్యాంగురాలు కిడ్నాప్..!



కిడ్నాపైన దివ్యాంగురాలు

గజపతినగరం: మండలంలోని కొత్త శ్రీరంగ రాజపురంలో నివాసం ఉంటున్న దివ్యాంగురాలు కొలుసు సత్యవతి (21) ఆదివారం మధ్యాహ్నం నుంచి కనిపించక పోవడంతో తల్లి పాపయ్యమ్మ గజపతినగరం పోలీస్‌స్టేషన్‌లో ఎవరో కిడ్నాప్ చేసినట్లు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్సై యు.మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సత్యవతి దివ్యాంగురాలని, తనంతట తాను నడవలేదని ఎవరో కిడ్నాప్ చేసి ఉంటారని తల్లితో పాటు తండ్రి బంగారయ్య, బంధువులు, గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో గృహిణి మృతి



చెరువు గర్భంలో ఔరుగడ్డిలో పడిఉన్న సావిత్రి మృతదేహం

బలిజిపేట: మండలంలోని గంగాడ గ్రామంలో అనుమానాస్పద స్థితిలో గృహిణి జి.సావిత్రి (56) మృతదేహం గ్రామసమీపంలో గల రామన్న చెరువులో కనిపించింది. ఈ ఘటనపై ఎస్సై పాపారావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సావిత్రి శుక్రవారం మధ్యాహ్నం 12గంటల నుంచి కనిపించడం లేదని ఆమె మేనల్లుడు హేమసుందర్ శనివారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం గ్రామం గ్రామ పరిసరాల్లో వెతుకుతుండగా రామన్న చెరువు గర్భం ఔరుగడ్డిలో ఆమె మృతదేహం కనిపించింది. దీనిపై క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లతో దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం రూరల్ సీఐ కె.రవికుమార్ తెలిపారు. సావిత్రికి, భర్త అప్పలనాయుడు కొంతకాలంగా వేరుగా ఉంటున్నారు. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. భూమి విక్రయించే విషయంలో భార్యాభర్తల మధ్య వివాదాలు నెలకొన్నాయి. దీనిపై ఆమెను పథకం ప్రకారం భర్త, కుమారుడు, మరిది చంపి ఉంటారని కూతురు, బంధువులు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

వంగర: మండల పరిధి పెదరాజులగుమ్మడ గ్రామానికి చెందిన రెడ్డి కృష్ణమూర్తి (46) రెండు రోజుల క్రితం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వంగర పోలీసులు తెలిపారు. రెండు రోజుల క్రితం ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న కృష్ణమూర్తి పురుగు మందు తాగడంతో కుటుంబసభ్యులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం మృతిచెందాడు. దీనిపై ఏఎస్సై సూర్యనారాయణ కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అక్కరకొచ్చే చట్టం

- త్వరితగతిన కేసుల పరిష్కారానికి ఆస్కారం
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా తీర్పులు
- బాధితులకు భద్రత..భరోసా
- విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న యంత్రాంగం



న్యాయస్థానంలో నూతన చట్టాలపై న్యాయవాదులతో చర్చిస్తున్న న్యాయమూర్తి

పాలకొండ రూరల్: దాదాపు 160 సంవత్సరాల నుంచి అమల్లో ఉన్న పాత చట్టాలను ప్రస్తుత సమాజ పరిస్థితులకు అనుగుణంగా మలుచుకోవాలని డాక్టర్ రణబీర్ సింగ్ కమిటీ ఇచ్చిన సిఫార్సుల మేరకు భారతదేశ న్యాయ వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం నూతన చట్టాలను రూపొందించింది. ఇండియన్ పీనల్ కోడ్ 1860 స్థానంలో భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్), సీఆర్పీసీ 1973 స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 స్థానంలో భారతీయ సాక్ష్యా అధినియం(బీఎస్ఏ) చట్టాలుగా మార్పుచెందాయి. నూతన చట్టాల అమలుకు పోలీసు యంత్రాంగం సన్నద్ధమైంది. ఇప్పటికే నూతన చట్టాల తీరు, విధివిధానాలపై న్యాయ, పోలీస్‌శాఖలు విస్తృత అవగాహన కల్పించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయి. పాలకొండ జూనియర్ సివిల్ కోర్టులో న్యాయమూర్తి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ నేతృత్వంలో అధికారులు, అన్నివర్గాల ప్రజలకు విరివిగా అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి.

ఎఫ్ఐఆర్ లేకుండా ప్రాథమిక విచారణ

జూలై 1 నుంచి కొత్త క్రిమినల్ చట్టాలు అమలులోకి వచ్చాయి. నూతన చట్టంలో ఈ-ఎఫ్ఐఆర్, జీరోఎఫ్ఐఆర్‌కు చోటు లభించింది. కొన్ని కేసుల్లో ఎఫ్ఐఆర్ లేకుండానే ప్రాథమిక విచారణ చేసే అవకాశం చట్టంలో కల్పించారు. ప్రాథమిక విచారణలో నేరం జరిగినట్లు రుజువైతే ఎఫ్ఐఆర్ నమోదు ఉంటుంది. నూతన చట్టాల ప్రకారం న్యాయమూర్తులు కేసులను రెండు వాయిదాలకు మించి ఎక్కువ రోజులు పొడిగించడానికి వీలుండదు. పోలీస్ శాఖకు పూర్తి అధికారాలు ఉండడంతో కేసు త్వరగా పూర్తవుతుంది. కొత్త చట్టం ద్వారా దర్యాప్తు అధికారులకు అధికారాలను ఎక్కువ కట్టబెట్టారని న్యాయవాదులు అభిప్రాయ పడుతుండగా, బాధితులకు భరోసా, భద్రత కలుగుతుందన్నది పోలీసు అధికారుల అభిప్రాయంగా ఉంది.

చిన్న కేసులైనా పెద్ద శిక్షలు..

నూతన చట్టాల ప్రాప్తికి దొంగతనం, గొలుసు చోరీ, చిన్న చిన్న కేసుల్లో సైతం అరెస్టయి జైలుకు వెళ్లాల్సి ఉంటుంది.

- ఫోన్‌లో దూషించినా, ఫొటోల మార్ఫింగ్‌కు పాల్పడుతూ ఇబ్బందులకు గురిచేసినా కఠినమైన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుంది.
- మహిళలపై జరిగే దాడులు, లైంగిక వేధింపులు, పోక్సో కేసుల్లో రెండు నెలల్లోపు పోలీసు దర్యాప్తులు పూర్తిచేసి చార్జిషీటు వేయాల్సి ఉంది.
- కాలయాపన జరగకుండా ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా నేరస్తులకు శిక్షపడి ఖరారు చేయనుండడంతో బాధితులకు భరోసా కలుగుతుంది.
- దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, విజిలెన్స్, విభాగాలకు దర్యాప్తు అధికారాలను నూతన విధానంలో అధికంగా కల్పించారు.
- జీరో ఎఫ్ఐఆర్ ద్వారా కాలయాపన జరగదు. బాధితులకు తక్షణ సాయం అందుతుంది.
- 15 ఏళ్లలోపు వారు, 60 ఏళ్లు పైబడిన వారు పోలీస్ స్టేషన్‌కు రాకుండా వారి నుంచి పోలీసు అధికారులు సాక్ష్యాధారాలు స్వీకరించాల్సి ఉంది.
- ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేసుకునే సౌకర్యం కల్పించినప్పటికీ మూడు రోజుల్లోగా ఫిర్యాదుదారు స్టేషన్‌కు వచ్చి సంతకాలు చేయాల్సి ఉంటుంది.
- చిన్నపాటి నేరాల్లో నేరస్తుల్లో పరివర్తన తీసుకువచ్చే విధంగా కమ్యూనిటీ సర్వీస్ చేసేలా శిక్షలు ఉన్నాయి.
- బాధితులకు న్యాయం ఏ విధంగా జరుగుతుందనే విషయాన్ని కేసు నమోదైన 90రోజుల లోపు దర్యాప్తు అధికారులు చెప్పాల్సి ఉంది.
- ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ద్వారా బాధితుల స్టేట్‌మెంట్ రికార్డు చేసే అవకాశం ఉంది. -ఈ-సాక్ష్, సంకలన్ వంటి యాప్‌లను పోలీస్ యంత్రాంగం కలిగి ఉండాలి.

నిరంతర కసరత్తు



దేశ న్యాయ వ్యవస్థ ఎంతో గౌరవనీయమైనది. బాధితులకు న్యాయం అందించే క్రమంలో నిరంతర కసరత్తు జరుగుతుంది. వందల ఏళ్ల క్రితం రూపొందించిన చట్టాల్లో నేటి సమాజ పరిస్థితులకు అనుకూలంగా మార్పులు తీసుకువచ్చారు. భారతీయ శిక్షాస్మృతిలో రాజద్రోహాన్ని ప్రస్తుతం దేశ ద్రోహంగా మార్పుచేశారు. కులం, మతం పేరిట దాడులకు, హత్యలకు పాల్పడితే గతంలో విధించే ఏడేళ్ల శిక్ష. ఇప్పుడు యావజ్జీవంగా మారింది. పిల్లలు, మహిళలపై దాడులు, క్రయవిక్రయాలు, లైంగిక దాడులు, సామూహిక లైంగిక దాడి రుజువైతై జీవితకాలం లేదా మరణ శిక్ష పడే అవకాశాన్ని నూతన విధానంలో పొందుపర్చారు.

ఎ.విజయ్‌రాజ్ కుమార్, న్యాయమూర్తి, పాలకొండ జూనియర్ సివిల్‌కోర్ట్

నేరుగా న్యాయం జరిగే అవకాశం



నూతన చట్టాల ద్వారా పోలీస్ యంత్రాంగానికి, దర్యాప్తు సంస్థలకు ప్రత్యేక అధికారాలు సంక్రమించనున్నాయి. వాటి ప్రాప్తికి వివిధ కేసుల్లో బాధితులకు నేరుగా న్యాయం జరుగుతుంది. నేరస్తులు ఎంత టివార్లైనా తప్పించుకోకుండా శిక్ష అనుభవిస్తారు. పారదర్శకతకు అవకాశం ఉంటుంది. శాఖా పరమైన ఉన్నతాధికారుల ద్వారా నూతన చట్టాలు, మౌలిక మార్పులపై అవగాహన పెంచుకుంటూ సహ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నాం.

జీవీ.కృష్ణారావు, డీఎస్పీ, పాలకొండ

అధికారాలు తక్కువ



కేంద్ర ప్రభుత్వం ఇటీవల అమల్లోకి తీసుకువచ్చిన నూతన క్రిమినల్ చట్టాలలో పోలీసు శాఖకు ప్రత్యేక అధికారాలు కేటాయించారు. మేజిస్ట్రేట్ అధికారాలు తగ్గుముఖం పట్టాయి. చట్టాలను అమలు చేసే న్యాయమూర్తులకు, న్యాయవాదులకు ముందస్తు అవగాహన కల్పించేలేదు. అసలు పార్లమెంట్‌లో ఎటువంటి చర్చ లేకుండా అమల్లోకి తీసుకువచ్చారు. నూతన విధానంలో ఆర్టికల్ 21 (వక్తి హక్కులు) దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉంది. పాత, కొత్త కేసులను పరిష్కరించడంలో న్యాయ వ్యవస్థలో గందరగోళం అధిగమించాల్సి వస్తుంది.

చందక జగదీష్‌కుమార్, ఏజీపీ, పాలకొండ

క్షత్రియ పరిషత్‌కు నూతన కార్యవర్గం



క్షత్రియ పరిషత్ విజయనగరం నూతన కార్యవర్గ సభ్యులు

విజయనగరం: క్షత్రియ పరిషత్ విజయనగరం జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక పూర్తయింది. నగరంలోని క్షత్రియ పరిషత్ కల్యాణ మంటపం ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఎన్నికలో నూతన అధ్యక్షుడిగా పెనుమత్స సీతారామరాజు, కార్యదర్శిగా సాగి.శివసీతారామరాజు, కోశాధికారిగా జి.రామరాజులు ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా నల్లపరాజు సత్యనారాయణ రాజు, ఇందుకూరి వెంకటపతి రాజు, పూసపాటి అప్పల నరసింహరాజు, పెనుమత్స వెంకట శ్రీధర్‌లు ఎన్నిక కాగా..సహాయ కార్యదర్శులుగా కేఆర్‌కే రాజు, ఎస్ఎస్ఎస్ఎస్ వీఆర్ఎం రాజు, జీఎస్ఎన్ రాజు, కాకర్లపూడి అజయ్ మోహన్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఇందుకూరి అశోక్ రాజు, దాట్ల వెంకట రామచంద్ర రాజు, గణరాజు కృష్ణంరాజు, కేవీ సూర్యనారాయణ రాజు, ఎస్ఎస్ఎన్ బి రాజు, సాగి అప్పల రాజు, దంతులూరి చిన సూర్యనారాయణ రాజు, పి సత్యనారాయణ రాజులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారి ఎంఎల్ఎస్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ప్రక్రియకు ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా పరిషత్ సేవలు అందించాలని పిలుపునిచ్చారు. సమాజంలో గౌరవం పెరిగేటట్లు ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో కుచ్చర్లపాటి త్రిమూర్తులు రాజు, పాకలపాటి గోపాలరాజు, ఇందుకూరి అప్పల రాజు, యూత్ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు బహిరంగ క్షమాపణ



బ్రాహ్మణులకు బహిరంగ క్షమాపణ చెబుతున్న పైల దాసు

పార్వతీపురంటౌన్: బ్రాహ్మణులపై వారి కులవృత్తిపై, వారి మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియా, ఫేస్‌బుక్‌లో పోస్టులు సెండ్ చేసిన పైల దాసు ఆదివారం పట్టణంలో బహిరంగ క్షమాపణ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయనని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. ఫేస్‌బుక్‌లో క్షమాపణ చెబుతూ లిఖితపూర్వంకంగా హామీ ఇచ్చి, భవిష్యత్తులో ఇలాంటి పోస్టులు సెండ్ చేయనని స్పష్టం చేశారు. దీంతో బ్రాహ్మణ పెద్దలు, బ్రాహ్మణులు, బ్రాహ్మణ స్త్రీలు సంతృప్తి చెందారని. చేసిన తప్పులను పశ్చాతాపంతో తానే ఒప్పుకోవడంతో వారంతా మనస్ఫూర్తిగా అంగీకరించారన్నారు. తమకు న్యాయం జరిగినందున ఏ రకమైన కేసులు రిజిస్టర్ చేయవద్దని పోలీసులను బ్రాహ్మణులు కోరారు. తమకు సహకరించి న్యాయం చేసిన ఏఎస్పీ ఒ.దిలీప్ కిరణ్, రూరల్ సీఐ కవిటి రవికుమార్, కొమరాడ మండల ఎస్సై కె.నీలకంఠం, పోలీసు వారికి, ప్రింట్-ఎలక్ట్రానిక్ మీడియోకు పార్వతీపురం బ్రాహ్మణులు ధన్యవాదాలు తెలియజేశారు.

నేడు సహారా ఖాతాదారుల ధర్నా

పార్వతీపురం: సహారా ఖాతాదారులకు చెల్లింపులు జరపాలని కోరుతూ సోమవారం ఉదయం 10 గంటలకు ఖాతాదారులతో ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించనున్నామని సంస్థ సీనియర్ ఏజెంట్లు ఎ.శ్రీనుబాబు, జీఎల్.నారాయణ, ఎస్‌వీ.రమణ తదితరులు ఆదివారం తెలిపారు. 2012నుంచి డిపాజిట్ చేసిన ఖాతాదారులకు చెల్లింపులు జరపకుండా కోర్టులో కేసు పెండింగ్ ఉందని, నేడు, రేపు అంటూ కాలయాపన చేస్తున్నారని, ఈ కారణంగా అటు ఖాతాదారులు, ఇటు ఏజెంట్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చెల్లింపులు జరిపించి ఖాతాదారులను ఆదుకోవాలని కోరారు. సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని ఖాతాదారులు విజయవంతం చేయాలని కోరారు.

మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పుణ్యవతి



మండలకేంద్రంలో నిరసన తెలియజేస్తున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె పుణ్యవతి, బలస శ్రీనివాసరావు

రామభద్రపురం: మండలంలోని జీలికవలస గిరిజన గ్రామంలో గిరిజన కుటుంబానికి చెందిన పసికందుపై లైంగికదాడికి పాల్పడిన మానవ మృగం ఎరకన్నదొరను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కె.పుణ్యవతి డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ నాయకుడు బలస శ్రీనువాసరావుతో కలిసి ఆదివారం ఆమె ఆరునెలల పాపపై జరిగిన లైంగికదాడికి వ్యతిరేకంగా మండలకేంద్రంలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఢిల్లీ నుంచి గల్లీ వరకు చిన్నా పెద్ద తేడా లేకుండా మహిళలపై అనేక రకాలుగా దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఇలాకాలో ఉన్న రామభద్రపురం మండలంలో గిరిజన పసికందుపై ఇలా జరగడం చాలా బాధాకరమని ఆవేదన వెలిబుచ్చారు. పసికందుపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిపై పోక్సో, నిర్భయ కేసులు నమోదు చేసి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ డీఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇచ్చారు.

తైక్వాండో పోటీలకు 170 మంది హాజరు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదితిగజపతిరాజు



తైక్వాండో పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు

విజయనగరం: జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలు ఉత్సాహంగా సాగాయి. నగరంలోని తోటపాలెం గాయత్రి విద్యా సంస్థల ప్రాంగణంలో నిర్వహించిన పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 170 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు, జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ వేణుగోపాలరావు, చైర్మన్ కె.సుభాష్ చంద్రబోస్ ప్రారంభించారు. ఆద్యంతంఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు త్వరలో అనంతపురం జిల్లాలో జరగనున్న అంతర్‌జిల్లాల తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో విజయనగరం జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే అదితిగజపతిరాజు మాట్లాడుతూ క్రీడలు జీవితంలో భాగం కావాలని సూచిస్తూ తద్వారా ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు గురానఅయ్యలు మాట్లాడుతూ 17 వ జిల్లా స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా వ్యాప్తంగా 170మంది క్రీడాకారులు హాజరయ్యారని, జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన వారిని, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు సతీమణి సింధు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతి ప్రదానం చేసిన మంత్రి

జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి విజయనగరం జిల్లా కీర్తి ప్రతిష్ఠలను చాటి చెప్పాలని ఆకాంక్షించారు.

నకిలీ మొక్కజొన్న విత్తనాల విక్రయం

- ఆందోళన చేసిన రైతులు



జనతా రైతు డిపో వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

వీరఘట్టం: నకిలీ మొక్కజొన్న విత్తనాలు విక్రయిస్తూ వ్యాపారులు మోసగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదంటూ రైతులు మండిపడ్డారు. ఈ మేరకు వీరఘట్టంలోని జనతా రైతు డిపో షాపు వద్ద ఆదివారం పలువురు రైతులు ఆందోళన చేశారు. ఈ షాపులో కొన్న మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తకపోవడంతో తాను తీవ్రంగా నష్టపోయానని బాధిత రైతు ఆరోపించాడు. కిలో మొక్క జొన్న విత్తనాలు రూ.2,300 చొప్పున 7 కిలోల విత్తనాలను రూ.16,100 లకు కొనుగోలు చేశానని, అయితే ఆ విత్తనాలు మొలకెత్తక పోవడంతో తీవ్రంగా నష్టపోయానని, ఈ విషయాన్ని సంబంధిత షాపు యజయానికి చెప్పినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని బాధిత రైతు ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇటువంటి నకిలీ విత్తనాలు అమ్ముతున్న వ్యాపారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అధికారులను ప్రశ్నించాడు. ఇదిలా ఉండగా ఇటీవల గిరిజనులకు 90 శాతం సబ్సిడీపై ఇచ్చిన వరి విత్తనాలను ఈ షాపు యజమాని కొనుగోలు చేసి అక్రమంగా విక్రయాలు చేసినట్లు ఇప్పటికే ఆరోపణలు ఉన్నాయి.అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇటువంటి అక్రమ విత్తనాల విక్రయాలు జరుగుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

పరిశీలిస్తాం..

వీరఘట్టం జనతా రైతు డిపోలో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తకపోతే సంబంధిత కంపెనీ ప్రతినిధులు వచ్చి విత్తనాలు వేసిన పంట పొలాన్ని పరిశీలిస్తారు. బాధిత రైతుకు పరిహారం వస్తుంది. అలాగే ఆరోపణలు ఉన్న షాపులో తనిఖీ చేసి శాఖాపరమైన చర్యలు చేపడతాం.

జె.సౌజన్య, మండల వ్యవసాయశాఖ అధికారి

యువత అభివృద్ధికి నైపుణ్యం

- గత ప్రభుత్వంలో యువతకు ఉపాధి బాటలు
- నేడు ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం



పార్వతీపురంలోని ఎస్‌వీడీ కళాశాలలో జాబ్ మేళాకు ఎంపికైన యువత (ఫైల్)

పార్వతీపురంటౌన్: ప్రపంచం నేడు అనేక సవాళ్లు ఎదుర్కొంటోంది. వాటిలో చాలా వరకు యువతను ప్రభావితం చేస్తాయి. యువతలో స్థిరమైన నైపుణ్యాన్ని పెంపొందించే విధంగా ఏటా జూలై 15న ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం నిర్వహిస్తుంటారు. యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా గత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. అందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటయ్యాక జిల్లాలో నాలుగు స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేసి సుమారు1005 మందికి వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చింది. అదేవిధంగా స్కిల్‌హబ్స్‌లో శిక్షణ పొందిన సుమారు 650 మందికి వివిధ కంపెనీల్లో ఉపాధి అవకాశాలు అందించింది.

జిల్లాలో4స్కిల్ హబ్‌లు

సీతంపేట ఐటీఐ కాలేజీలో ఒకటి, గుమ్మలక్ష్మీపురంలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ, పార్వతీపురంలో ఎమ్మార్‌నగరం పాలిటెక్నిక్ కాలేజీ, సాలూరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేశారు. ఈ నాలుగు స్కిల్ హబ్‌లలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, క్రెడిట్ ప్రాసెసింగ్ ఆఫీసర్, ఎలక్ట్రీషియన్, స్వ్యూయింగ్ మిషన్ ఆపరేటర్, రిసెప్షనిస్ట్ వంటి కోర్సుల్లో శిక్షణ అందజేస్తారు.

జాబ్ మేళాలతో 2468 మందికి ఉపాధి

జిల్లా ఏర్పాటైన నాటి నుంచి ఇప్పటివరకు మినీ, మెగా జాబ్ మేళాలు 22 వరకు నిర్వహించారు. ఈ జాబ్ మేళాల ద్వారా సుమారు 2468 మందికి ఉపాధి కల్పించారు.

జనరల్ ప్లంబర్ ల్యాబ్

కమల్ వెల్ఫేర్ ఫౌండేషన్ ద్వారా సీఎస్ఆర్‌తో రూ.5 లక్షలతో జనరల్ ప్లంబర్ ల్యాబ్‌ను భద్రగిరి ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఇది మన్యం జిల్లా యువతకు బాగా ఉపయోగపడుతుంది.

జిల్లాలో 9 ఈఎస్‌సీ సెంటర్‌లు

మన్యం జిల్లాలో 9 ఈఎస్ఈ సెంటర్స్ ఉన్నాయి. డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఈ సెంటర్స్ ద్వారా శిక్షణ ఇస్తున్నారు. పైథాన్, జావా, కమ్యూనికేషన్ స్కిల్స్, ఎంఎస్‌ఆఫీస్, డిజిటల్ మార్కెటింగ్ వంటి స్కిల్స్ ఈ సెంటర్స్‌లో నేర్పిస్తున్నారు. ఇప్పటివరకు మన్యం జిల్లాలో 1783 మంది స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఈ శిక్షణ అందుకున్నారు.

మరో ఐదు ప్రైవేట్ ట్రైనింగ్ సెంటర్లు

జిల్లాలో 5 వరకు ప్రైవేట్ ట్రైనింగ్ సెంటర్‌లకు అనుమతులిచ్చారు. వీటి ద్వారా ఇప్పటివరకు 330 మంది వరకు ట్రైనింగ్ పొందారు. బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, కంప్యూటర్ హార్డ్‌వేర్ టెక్నీషియన్, ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్, ఏసీ టెక్నీషియన్, సోలార్ ప్యానల్ బోర్డు టెక్నీషియన్ వంటి కోర్సులకు ప్రైవేట్ సెంటర్స్‌లో శిక్షణ అందజేస్తున్నారు.

లారీ ఢీకొని మహిళ దుర్మరణం



చందక శారద (ఫైల్)



రోదిస్తున్న కుటుంబసభ్యులు

నెల్లిమర్ల రూరల్: విధి ఆడిన వింత నాటకంలో ఆమె ఓడిపోయింది. రెండు సార్లు మృత్యువు నుంచి తప్పించుకున్న ఆమె ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. మూడోసారి మాత్రం మృత్యువు నుంచి తప్పించుకోలేకపోయింది. నెల్లిమర్ల మండలంలోని వల్లూరు జంక్షన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సతివాడ గ్రామానికి చెందిన చందక శారద(39) తన అన్నయ్య ఉత్తరనాయుడుతో కలిసి రణస్థలం మండలం గిరివానిపాలెం గ్రామానికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో నెల్లిమర్ల నుంచి వస్తున్న వెనుకగా వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని వల్లూరు సమీపంలో ఢీకొట్టడంతో వెనుక కూర్చున్న శారద రోడ్డుపై పడిపోయింది. తల వెనుక భాగంలో బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వాహనం నడుపుతున్న ఉత్తరనాయుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

రెండు సార్లు ప్రమాదం నుంచి తప్పించుకుని..

శారదకు ఏడాది క్రితం ఇదే తరహాలో రోడ్డు ప్రమాదం జరిగింది. తలకు బలమైన గాయం కావడంతో వైద్యులు మేజర్ ఆపరేషన్ చేశారు. ఆ గాయం నుంచి కోలుకుంటుండగానే ఇంట్లో జారి పడి మళ్లీ గాయాలపాలైంది. ఇప్పుడిప్పుడే పూర్తిగా కోలుకుంటున్న సమయంలో మూడోసారి జరిగిన ప్రమాదంలో మృత్యువు బారిన పడింది. ఆమె మృతితో సతివాడలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధం

- ఈ నెల 27, 28 తేదీల్లో భీమవరంలో రాష్ట్ర స్థాయి పోటీలు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న చెస్ పోటీలకు జిల్లా జట్టు సిద్ధమైంది. ఈ నెల 27, 28 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న అండర్ - 11 బాల, బాలికల అంతర్ జిల్లాల పోటీల్లో జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన లభించింది. చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో నగరంలోని ఫైర్ చెస్‌లో నిర్వహించిన ఎంపిక పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారికి అసో సియేషన్ కార్యదర్శి కెవి.జ్వాలాముఖి ఆధ్వర్యంలో ఎంపిక పోటీలు నిర్వహించగా.. క్రీడాకారులు విజయమే లక్ష్యంగా పోటీ పడ్డారు. పోటీల్లో బాలికల విభాగంలో కె.లితికశ్రీ, జి. సాయిశ్రీ, బాలుర విభాగంలో జి.ధర్మతేజ్, సాయిగణేష్ విజేతలుగా నిలిచారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారు లు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు తరపున ప్రాతిని ధ్యం వహించనున్నట్లు అసోసియేషన్ కార్యద ర్శి కెవి.జ్వాలాముఖి తెలిపారు. ఎంపిక పోటీలను అసోసియేషన్ ప్రతినిధులు అర్చన, పద్మ తదితరులు పర్యవేక్షించారు.

సేవలకు చారిటబుల్ ట్రస్ట్

విజయనగరం టౌన్: అయ్యప్ప భక్తులకు సేవలందించేందుకే చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసినట్లు జగదీష్‌బాబు గురుస్వామి పేర్కొన్నారు. అంబటిసత్రం సమీపంలో ఉన్న అయ్యప్ప పీఠంలో 139 సార్లు అయ్యప్పస్వామిని దర్శించుకున్న ఆయన ట్రస్ట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చేపట్టాల్సిన కార్యాచరణ పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇకపై ప్రతీ ఏటా అయ్యప్ప భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తమ ట్రస్ట్ తరఫున తమ వంతు బాధ్యతగా పూర్తి స్థాయిలో సహాయ సహకారాలందించేందుకు కృషి చేస్తామన్నారు. రానున్న రోజుల్లో అయ్యప్ప భక్తులు తమ ట్రస్ట్ తరపున అందించనున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా శిష్టకరణ సంఘం అధ్యక్షుడు ఎంపీజీ ఈశ్వరరావు, ఆడిటర్ గోవింద్‌రామ్, ట్రస్ట్ ప్రతినిధులు శ్రీనివాసరాజు, పిల్లా వెంకట సూర్యం, మజ్జి శివకుమార్, శ్రీధర్, గంగిరెడ్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.